తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

మంగళవారం 8-8-2023

ఎమ్మెల్సీ కవిత పెద్ద మనసు

పేద విద్యార్థికి సాయం

హైదరాబాద్, ఆగస్టు8 (తెలుగుప్రభ)

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి తన పెద్దమనసు చాటుకున్నారు. అభాగ్యులకు ఎప్పుడూ అండగా నిలబడే ఆమె తాజాగా నిజామాబాద్‌కు చెందిన ఓ నిరుపేద యువకునికి ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక చేయూత అందించారు. నగరానికి చెందిన సామల రితీష్‌కు అమెరికాలోని నార్త్ వెస్ట్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సీటు లభించింది. కానీ, చిన్న ఉద్యోగం చేస్తూ తన కుటుంబాన్ని పోషించే రితీష్ తండ్రి అమెరికాకు తన కొడుకుని పంపించే స్తోమత లేక ఇబ్బందుల పాలయ్యారు. ఈ విషయాన్ని రితీష్ ఎమ్మెల్సీ కవితకి తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ కవిత రితీష్ అమెరికాకు వెళ్లడానికి అవసరమయ్యే ఖర్చులను భరించారు. వారికి టికెట్స్ సొంత ఖర్చులతో ఇప్పించారు. తన కలను సాకారం చేసుకునేందుకు ఆర్థిక చేయూత అందించి అండగా నిలబడిన ఎమ్మెల్సీ కవితకు రితీష్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

దళిత బంధుపై కీలక నిర్ణయం

నియోజకవర్గంలో ఏకంగా 1100 మందికి
మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు8 (తెలుగుప్రభ)

దళిత బంధు పథకం అమలుపై తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత నియోజకవర్గానికి 100 మంది అని ప్రకటించిన కేసీఆర్.. ఇప్పుడు ఏకంగా 1100 మందికి ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హోంమంత్రి మహమూద్ అలీ తో కలిసి రెండో విడత దళిత బంధు పై సమీక్ష నిర్వహించారు. నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిప్యూటీ మేయర్, జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. వారం రోజులలో దరఖాస్తులను అధికారులకు అందజేయాలని సూచించారు. సమగ్ర విచారణ జరిపి అర్హులను ఎంపిక చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. లబ్ధిదారులు కోరుకున్న యూనిట్ లనే అందజేయాలని తెలిపారు. మొదటి విడతలో ఇచ్చిన యూనిట్‌లను తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు.

భూములు అమ్మొద్దని ధర్నా

రంగారెడ్డి జిల్లా, ఆగస్టు8 (తెలుగుప్రభ)

రంగారెడ్డి జిల్లా.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ మానస హిల్స్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ భూములు అమ్మ వద్దంటూ బీజేపీ నేతలు ధర్నాకు దిగారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వం పేదల భూములను లాక్కొని, వేలం పాట వేస్తోందని బీజేపీ నేతలు ఆరోపించారు.

సామాన్యులకు ఊరట..

దిగొస్తున్న టమాటా ధర

హైదరాబాద్, ఆగస్టు8 (తెలుగుప్రభ)

పెరిగిన టమాటా ధరలతో బెంబేలెత్తిన సామాన్యులకు ఇది ఊరటనిచ్చే విషయం. మార్కెట్లోకి టమాటాల రాక మళ్లీ పెరుగుతుండడంతో ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. హైదరాబాద్‌కు నిన్నమొన్నటి వరకు 850 క్వింటాళ్ల టమాటాలు రాగా నిన్న 2,450 క్వింటాళ్లు వచ్చాయి. దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున టమాటా వస్తోంది. రైతు బజార్‌లో ప్రస్తుతం కిలో టమాటా ధర రూ. 63గా ఉండగా బయట మార్కెట్లో మాత్రం రూ. 120 వరకు ఉంటోంది. ఈ నెలాఖరుకు రూ. 50 దిగువకు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

బాణాసంచా దుకాణంలో పేలుడు

ఎగసిపడ్డ మంటలు

పక్కనే పెట్రోల్ బంక్

తూర్పుగోదావరి, ఆగస్టు8 (తెలుగుప్రభ)

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామంలో బాణ సంచా దుకాణంలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి భారీ శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు భయబాంత్రులకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. తొస్సిపూడి గ్రామంలోని ఇండియన్ బంక్ పక్కన ఉన్న షెడ్డులో బాణాసంచా నిల్వ ఉంచారు. అనుకోకుండా బాణాసంచా పేలుడు సంభవించింది. ఆ పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ ఉండడం ఆందోళన కలిగించింది. ఉదయం పూట ఈ ప్రమాదం జరగడంతో పెద్దగా జనసంచారం లేకపోవడంతో అదృష్టవశాత్తు ప్రాణ నష్టం తప్పింది. అయితే ఈ ఘటనలో బంక్ పక్కన వున్న గాయత్రి రైస్ మిల్ స్వల్పంగా ధ్వంసమైంది. బంక్ పేలుడుతో భూకంపం వచ్చినట్లు శబ్దాలు వినిపించాయని చుట్టుపక్కల మూడు గ్రామాల్లోని ప్రజలు చెబుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ల్యాండ్ మైన్ బ్లాస్ట్

— ఏడుగురు దుర్మరణం

ఇస్లామాబాద్, ఆగస్టు8 (తెలుగుప్రభ)

పాకిస్తాన్ బలూచిస్థాన్లో భారీ పేలుడు సంభవించింది.

సోమవారం అర్ధరాత్రి బలూచిస్థాన్లోని పంజ్గుర్ జిల్లాలో ఓ వాహనం లక్ష్యంగా ల్యాండ్మైన్ పేల్చారు.దీంతో బల్గతార్ యూనియన్ కౌన్సిల్ చైర్మన్ ఇష్తియాక్ యాకూబ్తో సహా ఏడుగురు మరణించారు.గత రాత్రి ఓ వివాహ వేడుకకు హాజరైన ఇష్తియాక్.. తన కారులో తిరుగుపయణమయ్యారు. ఈ క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న కారును లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. వాహనం బల్గతార్ ప్రాంతంలోని చకర్ బజార్ వద్దకు చేరుకోగానే మందపాతరను పేల్చారు. దీంతో ఇష్తియాక్ సహా ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు దవాఖానలో చికిత్సపొందుతూ చనిపోయారని పంజ్గుర్ డిప్యూటీ కమిషనర్ అష్జద్ సోమ్రో చెప్పారు.

ఇసుక లారీ బీభత్సం

మద్యం మత్తులో డ్రైవర్

భూపాలపల్లి, ఆగస్టు8 (తెలుగుప్రభ)

భూపాలపల్లి జిల్లాలో ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో డ్రైవర్ లారీని వాహనాలపైకి తీసుకెళ్లాడు. అంబేద్కర్ సర్కిల్‌లో ఓ షాపు ముందు ఉన్న వాహనాలపైకి లారీ దూసుకెళ్లడంతో లారీ ముందు భాగంలో ఓ వ్యక్తి ఇరుక్కున్నాడు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న బాధితుడు రంజిత్‌ను స్థానికులు బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. లారీ బీభత్సంతో రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.

నో బాల్ కాదు కదా?

- తోషాఖానా కేసులో పాక్ మాజీ ప్రధానికి మూడేళ్ల జైలు, అరెస్టు
- ఎన్నికల నేపథ్యంలో హడావిడిగా తీర్పు!
- అయినా గెలుస్తామంటున్న పీటీఐ
- షెహబాజ్‌కు షాక్ తప్పదా..?

ఇమ్రాన్ ఖాన్ క్లీన్ బౌల్డ్..

తెలుగు ప్రభ (ఆగస్టు7):

పాకిస్తాన్ మాజీ ప్రధాని, దిగ్గజ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్‌ను ఇస్లామాబాద్‌లోని స్థానిక కోర్టు తోషాఖానా కేసులో దోషిగా ప్రకటించిన వెంటనే పోలీసులు ఆయనను అరెస్టు చేయడం కలకలం రేపింది. ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో పెట్టడం ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లాభించేదేనా?

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను తోషాఖానా కేసులో దోషిగా ప్రకటిస్తూ ఇస్లామాబాద్ లోని స్థానిక కోర్టు రెండ్రోజుల క్రితం సంచలన తీర్పు వెలువరించింది. పాక్ ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన తనకు వచ్చిన విలువైన బహుమతులను నామమాత్రపు ధరకే చెల్లించి తీసుకున్నారని, కొన్నింటికి లెక్కాపత్రాలు లేకుండానే అక్రమంగా తనవద్ద ఉంచుకున్నారనే ఆరోపణలతో న్యాయస్థానం ఆయనకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా కూడా విధించింది. దోషిగా తేలడంతో పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం ఇమ్రాన్ ఖాన్ ఐదేళ్ల పాటు ఎన్నికలలో పాల్గొనకుండా అడ్డుకట్ట పడ్డట్టైంది. మరి ఇమ్రాన్‌ను అడ్డుకుని ప్రధాని షెహబాజ్ షరీఫ్ సాధించేదేంటి..? రాబోయే నేషనల్ అసెంబ్లీ ఎన్నికలలో ఇది ఆయన పార్టీకి లాభించేదేనా..?

ఎన్నికల వేళ అరెస్టు..

ఇమ్రాన్ అరెస్టు వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ – ఎ – ఇన్సాఫ్ (పీటీఐ) ఆరోపిస్తున్నది. ఇమ్రాన్ కూడా తనపై మోపబడ్డ కేసును 'లండన్ కుట్ర'గా అభివర్ణిస్తున్నారు. ఇమ్రాన్ అరెస్టైన వెంటనే పీటీఐ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. ఇందులో కొన్ని హింసాత్మక ఘటనలూ జరిగిన వెంటనే వాటికి కూడా ఇమ్రాన్‌నే బాధ్యుడిని చేస్తూ ఆయన మీద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఇమ్రాన్‌ను వచ్చే ఎన్నికలలో అడ్డుకునేందుకు చేసే కుట్రలేనని పీటీఐతో పాటు అక్కడి రాజకీయ విశ్లేషకుల వాదనగా ఉన్నది.

ఏమిటీ తోషాఖానా కేసు?

మన భాషలో చెప్పాలంటే ప్రభుత్వానికి గానీ, ప్రభుత్వ అధికారులకు గానీ వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే బహుమతులను భద్రపరిచే ప్రభుత్వ ఖజానాను తోషాఖానా అంటారు. ప్రధాని, మంత్రులు, సైనికాధికారులు.. ఇలా ప్రభుత్వంలో అనుబంధంగా ఉన్నవారెవరైనా తమకు వచ్చిన బహుమతులను ఇందులో భద్రపరచాలి. ఒకవేళ వాటిని తమ వద్దే ఉంచుకోవాలనుకుంటే మాత్రం వాటి విలువలో సగం చెల్లించాలి. 2018 ఎన్నికలలో గెలిచిన తర్వాత ప్రధానిగా ఎన్నికైన ఇమ్రాన్ ఖాన్.. తన హయాంలో సుమారు 58 ఖరీదైన బహుమతులను (వీటి విలువ 14 కోట్ల పాకిస్తాన్ రూపాయలని అంచనా) అందుకున్నారు. వీటిలో చాలా వస్తువులను ఇమ్రాన్ తన వద్దే ఉంచుకుని కొన్నింటికి అత్తెసరు ధర చెల్లించి దక్కించుకున్నారని పాకిస్తాన్ ఎన్నికల సంఘం ఆరోపించింది. అదీగాక కొన్ని బహుమతులను విక్రయానికి కూడా పెట్టినట్టు ఆయనపై అభియోగాలున్నాయి. ఈ బహుమతులకు సంబంధించిన ఆదాయ వివరాలను ఎన్నికల ప్రమాణ పత్రంలో చూపలేదని గతేడాది అక్టోబర్‌లోనే పాక్ ఎన్నికల సంఘం ఆయనపై అనర్హత వేటు వేసింది. ఇప్పుడివే అభియోగాలపై విచారణ చేసిన ఇస్లామాబాద్ కోర్టు.. ఇమ్రాన్ ఖాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

ఈ ఏడాది నేషనల్ అసెంబ్లీ (పాకిస్తాన్ పార్లమెంట్)కి ఎన్నికలు జరగాల్సిఉంది. ప్రస్తుతం షెహబాజ్ షరీఫ్ సారథ్యంలోని ప్రభుత్వ పదవీకాలం ఈనెల 12తో ముగియనుంది. ప్రభుత్వం రద్దు అయిన తర్వాత 90 రోజుల్లోపు ఎన్నికలు నిర్వహించాలి. అంటే మూడు నెలల్లో పాకిస్తాన్‌లో ఎన్నికల హడావిడి సాగనుంది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ అరెస్టు ఆయనకు కలిసొచ్చేదే గానీ నష్టపోయేదేమీ లేదని రాజకీయ వర్గాల అభిప్రాయం.

మరి వాళ్ల సంగతేంది..?

తోషాఖానా వివరాలను పాకిస్తాన్ ప్రభుత్వం ఇటీవలే బహిర్గతపరిచింది. దీని ప్రకారం.. తోషాఖానా నుంచి బహుమతులను తక్కువ ధరకే దక్కించుకున్నవారిలో అధ్యక్షుడు ఆరిఫ్ అల్వి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధాని నవాబ్ షరీఫ్, మాజీ అధ్యక్షులు కూడా ఉన్నారు. 2008 నుంచి 2013 దాకా పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న కూటమిలో ఈ పార్టీ కూడా భాగంగా ఉంది) నాయకులు తమకు వచ్చిన 60 లగ్జరీ వాచ్ లనూ తక్కువ ధరకే కొట్టేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటి విలువ 12.2 మిలియన్స్ కాగా వాటిని 2 మిలియన్స్‌కే దక్కించుకున్నారు. వీళ్లపైనా ఆరోపణలు, కేసులున్నా ఇమ్రాన్ ఖాన్ మీద ఆగమేఘాల మీద తీర్పులు వెలువరించడం..అరెస్టులు చేయడం వెనుక కుట్ర దాగి ఉందని పీటీఐ ఆరోపిస్తున్నది. అయితే ఇది ఒకవిధంగా ఇమ్రాన్ ఖాన్‌కు సానుభూతిని తెచ్చేదేనన్న వాదన కూడా ఉంది.

కలిసొచ్చే ఆర్థిక సంక్షోభం..

ఇటీవల కాలంలో పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభం దిశగా సాగుతుంది. అక్కడ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జూలైలో పాకిస్తాన్ ద్రవ్యోల్బణ రేటు ఏకంగా 28.3 శాతానికి పెరిగింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న 3 బిలియన్ డాలర్లను ఇటీవలే మంజూరుచేసినా అది మరిన్ని ఆంక్షలతో విరుచుకుపడేందుకు సిద్ధమవుతోంది. ఇది పాకిస్తాన్ ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేసేదే. ఇవన్నీ ఇమ్రాన్ ఖాన్‌కు కలిసొచ్చే అంశాలే. తోషాఖానా కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు బెయిల్ వస్తే ఆయన ఎన్నికల బరిలోకి దిగకున్నా తన పార్టీ తరఫున అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తారు. ప్రజాకర్షక నేతగా ఉన్న ఇమ్రాన్‌ను బయటకు రానీయకుండా జైలులో ఉంచినా ఇప్పటికే ప్రభుత్వం మీద నివురుగప్పిన నిప్పులా ఉన్న వ్యతిరేకత మరింత ఎక్కువయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఎలా చూసినా ఇమ్రాన్ అరెస్టు ఆయనకు లాభించేదిగానే ఉంది. మరి షెహబాజ్ షరీఫ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఇమ్రాన్ విషయంలో ఎలాంటి వ్యూహాన్ని అమలుచేయనుందో.